
ప్రజాశక్తి
ఆదివారం 9 ఫిబ్రవరి 2025 5
విజయనగరం



ట్రేడ్ లైసెన్స్ ఉంటేనే విక్రయాలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

పశు మాంసాలు విక్రయించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరని వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం కంటోన్మెంట్, కలెక్టరేట్ ప్రాంతాల్లో పశు మాంసం విక్రయించే వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్సు, అన్ని అనుమతులూ ఉన్న వారు మాత్రమే పశు మాంసం విక్రయించాలని అన్నారు. అనుమతులు లేకుండా పశువులను వధించడం , రవాణా చేయడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా పశువుల వధించడం, రవాణా చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వారిపై షీట్లుకూడా ఓపెన్ చేస్తామని అన్నారు.

మాధవరాయమెట్టకు అనారోగ్యం



క్వారీ నుంచి వెదజల్లుతున్న కాలుష్యం

జామి మండల కేంద్రంలోని మాధవరాయమెట్ట అనారోగ్యం బారిన పడింది. కిడ్నీ వ్యాధుల బారిన కొందరు, టిబి, శ్వాస సంబంధిత వ్యాధులతో మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఉపాధి కల్పించే క్వారీలు, స్టోన్ క్రషర్ల నుంచి వచ్చే దూళితో వారంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్య సేవలందించాలని కోరుతున్నారు.

- దుమ్ము, ధూళి మధ్య ఆవాసాలు
- కిడ్నీ వ్యాధులతో మరణాలు
- స్టోన్ క్రషర్ వ్యర్థాలతో శ్వాస సంబంధిత వ్యాధులు
- చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ శాఖ

ప్రజాశక్తి - జామి

అది 1980 నాటి కాలం. జామి గ్రామ శివారున చిన్న గుడిసెలు వేసుకుని జీవించే కార్మిక కుటుంబాలవి. అరకు, అనంతగిరి, ఒడిశా ప్రాంతాల నుంచి క్వారీ పనుల కోసం వచ్చిన వారే ఎక్కువ. అత్యధికులు దళిత, గిరిజన కుటుంబాలే. ఒకరిద్దరితో మొదలైన కాలనీ నేడు 150 ఇళ్లకు చేరింది. అలాంటి కాలనీ వాసులకు కిడ్నీ మహమ్మారి సోకింది. సుమారుగా పది మంది వరకు కిడ్నీ వ్యాధితో చనిపోయారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. టిబి, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడి చనిపోయిన వారూ ఉన్నారు. కాలనీ చుట్టూ స్టోన్ క్రషర్లు వెదజల్లే దుమ్ము, ధూళి వల్లే కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారని జనం గగ్గోలు పెడుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఉపాధినిచ్చే క్వారీలే ఉసురు తీస్తున్నాయి

ఒకప్పుడు జామి క్వారీల్లో కాలనీ వాసులకు చేతినిండా పని దొరికేది. కానీ నేడు యంత్రాల వాడకం అందుబాటులోకి వచ్చాక కాంట్రాక్టర్లు జనాలను పనుల నుంచి తప్పించారు. పనులకు దూరమైన జనానికి, క్రషర్లు వెదజల్లే దుమ్ము, ధూళి శాపంగా మారాయి. బ్లాస్టింగులు జనానికి నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయి. మాధవరాయమెట్ట గ్రామానికి అడుగుల దూరంలో ఉన్న కపిల్ కాంక్రీట్ స్టోన్ క్రషర్ గతం కన్నా వందల రెట్లు సామర్థ్యం పెంచుకుని కాలనీపై విచ్చలవిడిగా వ్యర్థాలు వదులుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే కాలనీ వాసులు రకరకాల రోగాల బారిన పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులిచ్చినా పట్టడం లేదు.

కిడ్నీ వ్యాధికి బలైన వారు వీరే..

కాలనీలో కిడ్నీ బారిన పడి మొదట యువకుడు పిట్టా రాంబాబు మృత్యువాత పడ్డాడు. ఆ తర్వాత ఎద్దు గురుమూర్తి, మిడతాన దాలయ్య, పైడివోలి మాణిక్యం, కొట్యాడ అప్పారావు, కొర్రా కాంతమ్మ, బడిసేని అప్పారావు, వంతల ఘాసి.. ఇలా ఈ ఐదేళ్లలో చనిపోయిన వారిలో అత్యధులు కిడ్నీ వ్యాధితోనే. తాజాగా గుజ్జెల సునీయా, వంతల మల్లన్న శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడి, హఠాత్తుగా మరణించారు. ఇంకా అనేక మంది రోగాల బారిన పడి అవస్థలు పడుతున్నారు.

స్టోన్ క్రషర్ దుమ్ముతో నిండిపోతుంది



కాలనీకి అతి సమీపంలో స్టోన్ క్రషర్ ఉంది. దాని నుంచి నిత్యం దుమ్ము, ధూళి వస్తోంది. దీనివల్ల ప్రజలు రోగాల పాలవుతున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా, ఎవరూ పట్టించుకోవడం లేదు.

- కొర్రా నీలన్న, గిరిజన క్వారీ కార్మికుడు

గ్రీవెన్స్ ఫిర్యాదులు బుట్టదాఖలు



కలెక్టర్ గ్రీవెన్సులో ఇప్పటికి అనేక సార్లు ఫిర్యాదులు చేశాం. క్రషర్ వల్లే రోగాలు వస్తున్నాయి. అధికారులు వచ్చి, జనం కన్నా క్రషరే ముందు ఉందని అంటున్నారు. ఒకవేళ అదే నిజమైతే, కాలనీని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నాం.

- వంతల వెంకటి, గిరిజనుడు

అమృత పథకం 2.0 ద్వారా 'మధుపాడ'కు రూ.66 కోట్లు

- 3 ఎంఎల్‌డి నీటి సామర్థ్యం పెంపు కోసం నిధుల కేటాయింపు
- రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీలకూ..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి వస్తోందంటే చాలు.. నగర వాసులకు గుర్తుకు వచ్చేది తాగునీటి సమస్య. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం విజయనగరం నగరం. దీనివల్ల ప్రతి ఏటా వేసవి వస్తే నీటి సమస్య తీవ్రంగా మారుతుంది. నెల్లిమర్ల, మధపాడ పథకాల ద్వారా నీరు సరిగా రాకపోవడంతో రోజు తప్పించి రోజు పంపిణీ చేయాల్సిన పరిస్థితి అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. వచ్చే 15 ఎంఎల్‌డి నీరు వేసవి వస్తే 10 ఎంఎల్‌డికి తగ్గిపోతుంది. దీంతో ప్రతి ఏడాది తోటపల్లి నుంచి లేదా ఆంధ్ర ప్రాజెక్టుల నుంచి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల ద్వారా తెప్పించుకోవాల్సిన పరిస్థితి.



మధుపాడ పంపుహౌస్

ఈ ఏడాది కూడా అదే పరిస్థితి రావడం ఖాయం. అయితే వేసవి దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య పరిష్కారం కోసం కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత పథకం 2.0 ద్వారా ఈ ఏడాది చెరువులు, నీటి పథకాల నీటి సామర్థ్యం పెంపుదల కోసం నిధులు కేటాయించారు. అందులో భాగంగానే విశాఖ రీజనల్ పరిధిలో పలు మున్సిపాలిటీలకు, నగరపాలక సంస్థలకు నిధులు కేటాయించారు. వాటిలో ప్రధానంగా మదుపాడ నీటి పథకానికి రూ.66.38 కోట్లు కేటాయించారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో అమృత పథకం ద్వారా నిధులు రాష్ట్రంలో ఆయా పురపాలక సంఘాలకు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. అందులో భాగంగానే విజయనగరం నగర వాసులకు ప్రధాన నీటి వనరైన మధుపాడ నీటి పథకానికి నిధులు కేటాయించారు. పూర్తి స్థాయిలో కొత్త పైప్‌లైన్ వేయడం తోపాటు మధుపాడ ద్వారా 3 ఎంఎల్‌డి నీటి సామర్థ్యం పెంచడం, నీటి సరఫరా అభివృద్ధి చేయడం కోసం అమృత పథకం 2.0, ట్రెంచ్ 2 ద్వారా నిధులు కేటాయించారు. దీంతోపాటు జిల్లాలో నీటి సామర్థ్యం పెంపుదల కోసం నెల్లిమర్ల నగర పంచాయతీకి రూ.2.56 కోట్లు, రాజాం నగర పంచాయతీకి రూ 9.81 కోట్లు కేటాయింపులు చేశారు. వీటికి త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి

- జాబ్ కేలెండర్ విడుదల చేయాలి
- డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించి సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ అధ్యక్షతన స్థానిక గురజాడ గ్రంథాలయం వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో ఏర్పాటు సమావేశంలో రామన్న మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఆరు నెలలు దాటినా ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డిఎస్‌సి సంతకం చేసినా నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు. వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే రెండేళ్ల తర్వాత దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారని, వెంటనే ప్రైమరీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాడుతూ అహర్నిశలు కష్టపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించి శాసనసభకు పంపించాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నిరుద్యోగులు పాల్గొన్నారు.



నిరుద్యోగులతో మాట్లాడుతున్న డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

విద్యారంగాన్ని కాపాడుకుందాం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం జిఒ 117 పేరుతో విచ్ఛిన్నం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం కొన్ని పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మార్చి, మిగిలిన వాటిని ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చే ప్రయత్నం చేయటం చేస్తుందని, ఈ పాఠశాలలను రక్షించుకునే బాధ్యత తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులకు ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం నెల్లిమర్లలో యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 12,500 ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, వీటిలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య వచ్చే అవకాశం లేదని, ప్రస్తుతం మోడల్ స్కూల్స్ స్థాపిస్తామని చెప్పే దానికోసం చేస్తున్న కసరత్తులో మరిన్ని ఎక్కువ పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్నచోట మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చాలని, మిగిలిన పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకాన్ని కలిగించడం కోసం తల్లిదండ్రులని ఉపాధ్యాయులు కలవాలని, వారికి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యార్థులను తయారు చేయడం కోసం బాధ్యత తీసుకుంటామని హామీని ప్రతి ఉపాధ్యాయుడు ఇవ్వాలని కోరారు. తద్వారా ప్రభుత్వ బడిలో పిల్లల్ని చేర్పించాలని ప్రభుత్వ బడి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్ తక్షణం నియమించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యమాలతో ప్రజల పక్షాన నిలబడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.వి.రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస రావు, జెఎవిఆర్‌కె ఈశ్వర్ రావు, జిల్లా కార్యదర్శులు పతివాడ త్రినాథ్, సిహెచ్ తిరుపతి నాయుడు, మద్దిల రాజు, హరి మోహన్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సేవ ఒక భాగం కావాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సేవ కూడా జీవితంలో ఒక భాగం కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మంగళపాలెంలో శనివారం జరిగిన శ్రీగురుదేవ్ ఛారిటబుల్ ట్రస్టు 27వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో పల్లె ప్రజలకు ఇటువంటి సేవా కార్యక్రమాలను అందిస్తున్న గురుదేవ్ ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబును అభినందించారు. సర్వేజనా సుఖినోభవంతు అన్నది మన మౌలిక సూత్రమని తెలపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యనేర్పిన గురువులకు, సమాజానికి ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉండి సేవ చేయాలని సూచించారు. చదువుతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని, కుటుంబ వ్యవస్థ బలపడాలని, సామాజిక చింతన పెరగాలని, సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని కోరారు.

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో కేన్సర్ వ్యాధి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు తమ అనారోగ్యాన్ని ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్నారని, ట్రస్టులో కేన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం వల్ల వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

ముందుగా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన కేన్సర్ ఆస్పత్రిని, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని వెంకయ్యనాయుడు సందర్శించారు. అనంతరం జరిగిన సభలో వికలాంగులకు కృత్రిమ అవయవాలను, చేతికర్రలను, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లను, వినికిడి యంత్రాలను, వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ ప్రముఖ క్రికెటర్ యువరాజ్‌సింగ్ ఫౌండేషన్‌తో ఎంఒయు చేసుకుంటున్నామని, తద్వారా కేన్సర్ రోగులకు సేవలను, స్క్రీనింగ్ పరీక్షలను మరింత విస్తృతం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, వియుఎంసి హాస్పిటల్ సభ్యులు రత్నాకర్, యంగ్ ఇండియన్స్ బృందం, యువరాజ్ సింగ్ కేర్ ట్రస్ట్ బృందం పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థంలో సీతారాముల తిరుకల్యాణ మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి తిరుకల్యాణాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. ఆలయంలో వేకువజాము నుంచే కల్యాణ మహోత్సవ సందడి ప్రారంభమైంది. ముందుగా రామకోనేరు సవిత్రజలంతో ఆలయాన్ని పవిత్ర శుద్ధి చేశారు. ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, గొడవర్తి రామనరసింహాచార్యులు, ఖండవిల్లికిరణ్, పవన్‌కుమార్ తదితరులు స్వామివారికి ప్రాతఃకాల అర్చన గావించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం 8గంటలకు శ్రీమద్రామాయణపారాయణం, వేదపఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గంటన్నర సమయం పాటు విశేష హోమాలను జరిపించారు. సాయంత్రం 5గంటలకు విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం చేపట్టి సమస్త దేవతామూర్తులను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు. కాగా ఉత్సవ మూర్తులను పురవీధుల్లో అశ్వావాహనం, హంస, గరుడ వాహనాల్లో ఊరేగించి అర్చకులు కళ్యాణం తంతు పూర్తి చేశారు. దేవస్థానం సహాయ కమిషనర్ వై.శ్రీనివాస్ కళ్యాణం ఏర్పాట్లు పర్యవేక్షణలో ఎస్‌ఐ బి.గణేష్ బందోబస్త్ నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కర్రోతు బంగార్రాజు



ఊరేగింపు నిర్వహిస్తున్న ఖాదర్‌బాబా శిష్యులు

ఘనంగా ఉరుసు మహోత్సవం


ప్రజాశక్తి-విజయనగరం కోట

సూఫీ అధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్ వలీ 66వ సూఫీ సుగంధ మహోత్సవం శనివారం బాబామెట్ట దర్గా, దర్బార్ షరీఫ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవాలు మొదలయ్యాయి. అనంతరం ఖాదర్ బాబా దర్బార్ నుంచి ఆయన ప్రియ శిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదర్ బాబా సూఫీ ఆధ్యాత్మిక వారసులు చీమలపాడు దర్గా పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మోహియునుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం సూఫీ దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో భక్తులు ఫకీర్ మేళా, డప్పు వాయిద్యాలతో ఖాదర్ బాబా దర్గాకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.

పుండొక చోట.. మందొక చోట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'పుండు ఒక చోట ఉంటే, మందు మరో చోట వేసినట్టుగా ఉంది ధాన్యం కొనుగోలుపై జిల్లాలో అధికార యంత్రాంగం అనుసరిస్తున్న తీరు. ఇక ప్రజాప్రతినిధులకు ఎలాగూ పట్టింపులేదు. దీంతో, అన్నదాత అన్యాయానికి గురౌతున్నాడు'. ఇది కొద్దిరోజులుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో అధికారుల తీరుపై రైతాంగం ఒకింత అసహనం వ్యక్తమౌతోంది. అసలు విషయం పక్కకు నెట్టేసి, ఆకస్మిక తనిఖీల పేరిట హడావుడి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొందరు, తీసుకెళ్లిన ధాన్యానికి ట్రక్ షీట్లు జనరేట్ చేయడం లేదని మరికొందరు, విక్రయించిన ధాన్యానికి సంబంధించి ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఛార్జీలు తమకు చెల్లించలేదని ఇంకొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు గోనె సంచులకూ డబ్బులు ఇవ్వలేదంటున్నారు. దీనిపై రైతులను కలిసి, వాస్తవాలను తెలుసుకుని కొనుగోలుకు, రసీదులకు, హమాలీ, రవాణా ఛార్జీలు, గోనెసంచుల డబ్బులు చెల్లింపునకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు (జిల్లా జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లయ్ డిఎం) ధాన్యం మిల్లులను మాత్రమే తనిఖీ చేస్తున్నారు. అక్కడ ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించినట్టు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అమ్మపుట్టినిల్లు మేనమామకు తెలియదా? అన్నట్టుగా మిల్లులకు అధికారులు వస్తే ఎలాంటి విషయాలు పరిశీలిస్తారో? వాటిని ఏమేరకు పరిగణనలోకి తీసుకుంటారో తెలియదా? అని జనం చర్చించుకుంటున్నారు. వచ్చిన ప్రతి గింజా



మిల్లుకు తీసుకుంటున్నట్టు చెప్పడం, వాటికి లెక్కలు చూపించడం మిల్లర్లకు కొత్త కాదు. ఇక్కడ సమస్యేమంటే రైతులకు సంబంధించిన ధాన్యం జిల్లాలోని దాదాపు అన్ని మిల్లుల్లోనూ ఉన్నాయి. వాటికి ట్రక్ షీట్లు ఎప్పటికప్పుడు ఎందుకు ఇవ్వలేదు. ఇటువంటి సందర్భాల్లో ఎక్కడైనా, ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటున్నారా? అంటే అటువంటిదేమీ లేదనే సమాధానం వినిపిస్తోంది. ఈనేపథ్యంలో రైతుల వద్దకు వెళ్తే, ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలుకు ఎన్నాళ్లుగా కాలయాపన జరుగుతోందో? రైతులు గోనె సంచులకోసం పడుతున్న అవస్థలేమిటో, ఛార్జీలు చెల్లించక వారు నష్టపోతున్న పరిస్థితి ఎలా ఉందో అర్థమౌతుంది. ఇటువంటి ప్రయత్నమేదీ అధికారులు చేయలేదంటూ రైతులు అంటున్నారు. పైగా జిల్లాలో ఈ ఏడాది 2,43,400 ఎకరాల్లో వరి సాగైంది. తద్వారా 4,97,614 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో సుమారు 47వేల మెట్రిక్ టన్నుల మేర తిండికిపోగా రైతులు 4.50లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం విక్రయించేందుకు అవకాశం ముందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో నడిచే సివిల్ సప్లై విభాగం మాత్రం 3.20లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు మాత్రమే లక్ష్యంగా తీసుకుంది. ఇందులో 3,13 మెట్రిక్ టన్నుల (98శాతం) మేర కొనుగోలు చేసినట్టు గత నెలాఖరు నాటికే చిట్టాలు తయారు చేశారు. అదే గనుక నిజం అయితే, రైతుల వద్ద ప్రస్తుతం ధాన్యం ఎందుకు ఉండిపోతాయి. దీన్నిబట్టి మిల్లర్లు పిడిఎస్ బియ్యాన్ని లెక్క చూపిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీన్నిబట్టి అధికారులు క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు మిల్లులను మాత్రమే ఎందుకు పరిశీలిస్తున్నారన్నదానిపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.



దరఖాస్తులను చూపుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- రాష్ట్రపతికి అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్ల వ్యక్తిగత దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాష్ట్రపతికి అంగన్వాడీ కార్యకర్తలు వ్యక్తిగత దరఖాస్తులు పంపించారు. శనివారం కెఎల్‌పురంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ ఆ దరఖాస్తులను చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఐసిడిఎస్ ఏర్పాటు చేసి యాభై ఏళ్లు పూర్తయిందని, ఈ నేపథ్యంలో ఐసిడిఎస్‌ను క్రమబద్ధీ కరించాలని, దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలుతో పాటు, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని విజ్ఞప్తి చేస్తూ వ్యక్తిగతదరఖాస్తులను పంపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు ఎం.కృష్ణమ్మ, పి.ప్రభ, వరలక్ష్మి, పి.జ్యోతి, సిహెచ్ రూప, ఎం. రమణమ్మ, శ్యామల, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి

● మార్కెట్ ధర లేక విలవిల ● ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ పసుపుకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. ఇది గిరిజనులకు కొంతమేర ఆర్థిక చేయూతనిస్తుంది. ఏజెన్సీలో పసుపు ప్రకృతి సిద్ధంగా తయారవుతుంది. అందుకే దీనికి అంతర్జాతీయ ఖ్యాతి పలుకుతుంది, పసుపు రంగు, రుచి, ఛాయా ఉంటుంది. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంతోనే పండిస్తారు. అలాంటి పసుపుకు మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీ పసుపు కొనుగోలు చేయడానికి మైదాన వ్యాపారులు ఎగబాకుతారు. ఐటిడిఎ పరిధిలో 3,786మంది రైతులు 6,886 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. అయితే కొండపోడు భూముల్లో ఏప్రిల్, మే నెలలో పసుపు దుంపలు నాటుతారు. రెండేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుంది.

తయారు చేసే విధానం

దిగుబడి వచ్చిన పసుపు దుంపలను తవ్వి కడిగి సున్నగా కాడలు కట్ చేస్తారు. పెద్ద అండాలో ఉడకబెట్టి బాగా ఎండ బెట్టి ఆ తరువాత రోడ్లపై రంగ చిస్తారు. అప్పుడు పెట్టి విక్రయిస్తారు. గతంలో ప్రోత్సాహం కింద ఐటిడిఎ నుంచి పసుపు విత్తనాలు పాలిష్ యంత్రాలు పెట్టుబడి ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

మార్కెట్ ధర లేక

గిరిజనులు శ్రమించి తయారు చేసిన పసుపును ఎత్తైన కొండలపై నుంచి మోసుకొని సంతకు తెచ్చి కావిడి చొప్పున విక్రయిస్తారు. దీన్ని మైదాన ప్రాంత వ్యాపారులు, దళారులు కొంటారు. కావిడి పసుపు వెయ్యి రూపాయలలోపే విక్రయిస్తున్నారు. ఒక కావిడి పసుపు సుమారు 25 కేజీల నుండి 30 వరకు ఉంటుంది. విడివిడిల ద్వారా తూకం మంత్రంగా కొనుగోలు చేస్తున్నారని, గిరిజన సహకార సంస్థ అయితే అన్నలు కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మాదిరిగా ప్రభుత్వమే పసుపు కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించాలని కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పసుపు

సహజసిద్ధంగా తయారు చేస్తాం

పసుపును రసాయినిక ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సహజసిద్ధంగా మేమే తయారు చేస్తాం. అందువల్లే పసుపుకు మంచి వాసన, ఛాయా వస్తుంది.

ఎం.రైకన్న, దుంబంగివలస

జిసిసి కొనుగోలు చేయాలి

కష్టపడి పండించిన పసుపుకు మార్కెట్ ధర లేకపోవడంతో మాకు కష్టమే మిగులుతుంది. మాకు ఆర్థికంగా కొంత డబ్బులు వచ్చేది పసుపు వల్లే. అందుకే ఈ పసుపును ప్రభుత్వ సంస్థలైన జిసిసి కొనుగోలు చేయాలి.

మండంగి రియ్యన్న, గిరిజనుడు, దుంబంగివలస



ఎండబెట్టిన పసుపు కొమ్ములు

ప్రతిపాదనను పంపించాం

పసుపు రైతులకు విత్తనాలు ఉడకబెట్టిన అండాలు, పెద్ద పెద్ద ట్రబ్బులు, సోలార్ డ్రైవర్స్ పాలిష్ యంత్రాలు కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే ఇతర పనిముట్లు అందించేందుకు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలో ఇప్పటికే పంపించాం.

ఎస్.వెంకట గణేష్ , ఐటిడిఎ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, సీతంపేట



రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే మాధవి

ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలం కొప్పెర్ల గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రీ సైక్లింగ్ యూనిట్ ను రాష్ట్ర మంత్రి చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవి , మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో మానవ మనుగడకు ఎంతో ముప్పు ఉందన్నారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం ద్వారా ఎంతో ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ బుల్లె శ్రీధర్ , టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు 36 దరఖాస్తులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణం, రూరల్‌లో యాత కులస్తులకు కేటాయించిన రెండు మద్యం షాపులకు 36 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. మద్యం షాపులకు ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీలో ఒక షాపునకు 18, రూరల్‌లో షాప్‌నకు 18 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. విజయనగరంలో ఈనెల 10న షాపులకు లాటరీ తీయనున్నట్లు చెప్పారు.

ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో ఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్ రుసుములను చెల్లించాలని, లేకుంటే మార్చి ఒకటో తేదీ నుంచి వడ్డీ విధిస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ రుసుములను తమ సచివాలయ పరిధిలో ఉన్న కార్యదర్శికి మాత్రమే చెల్లించాలని చెప్పారు. అనధికార వ్యక్తులకు, ఇతరులకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లించవద్దని స్పష్టంచేశారు. ట్రేడ్ లైసెన్స్ రుసుములను స్వీకరించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుండి కొత్తగా గుర్తించిన ట్రేడ్ లైసెన్స్‌లకు ఫీజులు విధిస్తారని చెప్పారు.

వైభవంగా దేవుడుబాబు యాత్ర

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కొండకెంగువ గ్రామంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా జరిగిన దేవుడుబాబు యాత్ర వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బేబినాయన దేవుడుబాబును దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఒక సామాన్య భక్తుడిలా క్యూలైన్లో నిలబడి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కంచుపల్లి సుజాత, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెలమల ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, సర్పంచ్ ప్రతినిధి కంచుపల్లి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సిరిపురపు శ్రీనివాసరావు, గ్రామ పెద్ద బెవర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో స్వామి వివేకానంద ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి, పూజలు చేశారు. ఈ సందర్భంగా యాత్రికులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ వార్షికోత్సవానికి మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సైనికస్కూలు వైస్ ప్రిన్సిపాల్ కిరణ్

ఆకట్టుకున్న సైన్స్ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్లో సృజనోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటుచేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైనిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ వింగ్ కమాండర్ కిరణ్, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ అతిథులుగా పాల్గొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజి, వ్యవసాయం – ఆహారం, మన చుట్టూ ఉన్న పరిసరాలు – శుభ్రత, వాతావరణ మార్పుల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సీతయ్య, డైరెక్టర్ వీరాస్వామి, ప్రిన్సిపల్ బి.లక్ష్మణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మధు

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం వికలాంగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా మధు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర రవణమ్మ, మాజీ సర్పంచ్ మంచిని అప్పలసూరి, మాజీ వైస్ సర్పంచ్ కేదారి దొరబాబు, గ్రామ నాయకులు కేదారి బంగారయ్య, చామంతుల నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు సుంకరి అప్పారావు, ఉపాధ్యక్షులు కన్నయ్య దొర, అలమండ రాంబాబు, జొన్నపల్లి సత్తిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, అవతారం పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలి

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. రాజా కళాశాల మైదానంలో శనివారం బొబ్బిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి మార్గంలో ఉండాలని కోరారు. బొబ్బిలిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనను లోకబంధు విద్యాసంస్థల కరస్పాండెంట్ తూముల కార్తీక్ కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, అభ్యుదయ ప్రిన్సిపల్ చింతా శారద, అభయ ఆస్పత్రి వైద్యులు బూరి అనిల్ కుమార్, టోర్నమెంట్ నిర్వాహకులు బొత్స అప్పులు, సందీప్, క్రీడాకారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

అభివృద్ధే ధ్యేయం : కోండ్రు

ప్రజాశక్తి-రాజాం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం రాజాంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి సుమారు 80 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 50 నుండి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. మెయిన్ రోడ్డు నిర్మాణం పనులకు ఇప్పటికే రూ. 11 కోట్లు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదకుటుంబాలకు చెందిన ముగ్గురు రోగులకు సిఎం సహాయ నిధి నుంచి చెక్కులను అందజేశారు. అంతకాపల్లిలో మజ్జి గౌరీ అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్యదర్శుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం ఎపి ఎన్‌జిఒ హోంలో గ్రేడ్-1 నుండి గ్రేడ్-6 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా వై.రమణ, కార్యదర్శిగా పి.పార్థసారథిరావు, అసోసియేట్ అధ్యక్షులుగా జి.రఘుబాబు, కోశాధికారిగా టి.వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సిహెచ్ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.జగదీశ్, జి.కృష్ణ, జి.నారాయణరావు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ఎఎస్ ప్రసాద్, ఆర్.శివకుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రమణమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి రమణ, జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, నగర అధ్యక్షులు వై.ఆనంద్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.తవుడు పాల్గొన్నారు.



ఫోర్ట్‌సిటీలో వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫోర్ట్‌సిటీ పాఠశాలలో 13వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగే వార్షికోత్సవంలో తొలిరోజు విద్యార్థుల నృత్యాలు, నాటికలు, యోగా, పిరమిడ్స్, తైక్వాండో, కోలాటం మొదలగు అంశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించే నృత్యాలతోపాటు దేశ, విదేశాల వేషాధారణ, సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన నృత్యాలు ప్రదర్శించారు. ఫోర్ట్‌సిటీ పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) మాట్లాడుతూ నృత్యాలు, నాటికలు చూస్తున్నంత సేపు ప్రపంచమంతా ఒకసారి తిరిగి వచ్చినట్లు అనిపించేలా విద్యార్థులు తమ ప్రదర్శనలు ఇచ్చారని కొనియాడారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని తెలియజేసేలా విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. 2023-24 సంవత్సరానికి గాను అకాడమిక్ టాపర్లు, సెక్షన్ల ప్రకారం ఎక్కువ మార్కులు సాధించిన వారికి, శతశాతం హాజరు పొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ.. ఈ వార్షికోత్సవం విజయవంతం కావడానికి శిక్షణ ఇచ్చి, కృషిచేసిన పాఠశాల సిబ్బందికి, ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. చీపురుపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శనివారం నియోజకవర్గంలో ఉన్న ప్రజల సమస్యలను సేకరించి వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ఉండేలా చంద్రబాబు చూస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి రూ.9 లక్షల కోట్లు అప్పుల వాడి ఎవరికిచ్చారని ఇంకా వివిధ శాఖలకు సంబంధించి సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు మేర బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు. అప్పులు తెచ్చిన సొమ్ము లండన్‌లో దాచారా లేక ఏ దేశానికి మళ్ళించారని మండిపడ్డారు. 1.65 లక్షల కోట్లతో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, పైల బలరాం, సారిపాక సురేష్, వెన్ని సన్యాసినాయుడు, అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్, రెడ్డి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పార్టీలకు అతీతంగా కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర జరపాలి

పార్టీలకు అతీతంగా కనకమహాలక్ష్మి అమ్మావారి జాతర ఉత్సవాన్ని జరపాలని ఎమ్మెల్యే కళావెంకటరావు స్థానిక నాయకులకు, అధికారులకు సూచించారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం అమ్మవారి జాతర ఉత్సవ కార్యక్రమాలను ఆయన వివరించారు. మార్చి 2వ తేదీ నుండి 3,4 తేదీల వరకు అమ్మవారి జాతర ఉంటుందన్నారు. అనంతరం జాతరకు సంబంధించిన కర పత్రాలను స్థానిక నాయకులతో కలసి ఆయన విడుదల చేశారు.

ఆలయ కమిటీ ఉన్నట్లా లేనట్లా

కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మార్చి 2 నుండి 4వ తేదీ వరకు జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ప్రకటించారు. అయితే అమ్మవారి ఆలయానికి మాత్రం ఇప్పటి వరకు ఆలయ కమిటీ ప్రకటించలేదు. కనీసం ఉత్సవ కమిటీ అయినా వేస్తారనుకుని టిడిపిలోని కొంతమంది ఆశావహులు ఎదురు చేసినప్పటికీ నిరాశే ఎదురైంది. అమ్మవారి జాతర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతుందని కళావెంకటరావు చెప్పడంతో తెలుగుదేశం కేడర్‌లో అయోమయం నెలకొంది. ఈ పరిణామాలన్నింటిని గమనిస్తున్న స్థానిక ప్రజలు అమ్మవారి జాతర ఎలా జరుగుతుందోనని ఎదురు చూస్తున్నారు.

ఒడిశా సిఎం వ్యాఖ్యలపై ఐద్వా నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం

గిరిజన మహిళలపై ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యాన శనివారం స్థానిక సంతతోట వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి ఈ విధంగా మాట్లాడుతున్నారంటే దేశంలో గాని, రాష్ట్రంలో గాని మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తారో అర్థమవుతుందని ఆగ్రహించారు. గిరిజన మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరైనది కాదని, ఆయన వెంటనే మహిళలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మణిపూర్ సంఘటనతో పాటు దేశవ్యాప్తంగా మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయన్నారు. మనువాద సిద్ధాంతాన్ని తీసుకొచ్చి మహిళలు వంటింటికే పరిమితం అవ్వాలని, ఎలాంటి దుస్తులు ధరించాలో వంటి ఆంక్షలు పెట్టి, చులకనగా చూసే సంస్కృతి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు భవాని, తవుడమ్మ, లక్ష్మి, పావని, సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్లలోపు వయసున్న ప్రతిఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రత్యేకించి పాఠశాలలో ఈ మాత్రలను అందిస్తారని చెప్పారు. మధ్యాహ్న భోజన అనంతరం అరగంట తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని ఉన్నతాధికారులు వెల్లడించారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా చైతన్యవంతులై ఈ మాత్రలను పిల్లలతో తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక జ్యూట్ మిల్లు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేటకు చెందిన దిలీప్ కుమార్, కాశయ్యపేటకు చెందిన మేఘసాయి కలిసి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి కళాశాలకు వెళ్తున్నారు. జ్యూట్ మిల్లు పక్కనున్న అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ముందు వెళ్తున్న ఆటో నెమ్మదిగా వెళ్లడంతో వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు విద్యార్థులు మైనర్లు. అయినప్పటికీ తల్లిదండ్రులు వాహనం ఇవ్వడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గరివిడి మండల కేంద్రానికి చెందిన దండుసాయి సుక్రిత (29) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గరివిడిలోని ఇంటిదగ్గర విజయనగరం వెళ్లి వస్తానని చెప్పి వచ్చిందని, విజయనగరంలో తన పని ముగించుకొని, కాంప్లెక్స్ కు చేరుకొని తన తండ్రికి ఫోన్ చేసి తాను విశాఖపట్నం వెళుతున్నట్టు చెప్పిందని సిఐ తెలిపారు. కొన్ని నిమిషాల్లోనే మరల తండ్రి ఫోన్ చేస్తుంటే ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తన స్నేహితులకు బంధువులకు అందరికీ ఫోన్ చేసి ఆరా తీశారని తెలిపారు. శనివారం ఆమె తండ్రి దండు వెంకట జానకి రామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని పొగిరి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఆర్.జైభీమ్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ మేరకు వారి వద్ద నుండి 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే తగు చర్యలు తప్పవన్నారు. గ్రామాలలో గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చిరించారు. ఈ కార్యక్రమం ఎక్సైజ్ ఎస్ఐ మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టవలసలో బెల్ట్‌షాపుపై దాడి

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని మెట్టవలసలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం దాడి చేసి ఒకరిని అరెస్టు చేసి 13 మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.